రైతు బాగుంటేనే దేశం సుభిక్షం

• ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని డి.కొండాపురంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ పథకం ద్వారా ఉత్పాదక పెంపుదల కార్యక్రమ నిధులతో 170 మంది రైతులకు సబ్సిడీ ధరతో మంజూరైన 471 యూనిట్ల వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. శనివారం రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున, ఉపాధి హామీ ఏపీడీ జయకుమార్‌తో కలిసి విప్ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో డబ్ల్యూసీసీ పీఓ శ్రీ విద్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు పాలనలో వ్యవసాయం కుదేలైందన్నారు.

రైతు ద్రోహి చంద్రబాబునాయుడు..

విద్యుత్ స్లాబ్‌ను తగ్గించాలని అడిగిన రైతులను తుపాకులతో కాల్పించిన రైతు ద్రోహి చంద్రబాబు అని విప్ దుయ్యబట్టారు. వ్యవసాయం దండగ అని రైతులను , వ్యవసాయాన్ని కించపరిచిన నీచుడు అన్నారు. 2004లో వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. తండ్రి ఆశయ సాధనలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం పాటు పడుతున్నారన్నారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుకు బాసటగా నిలిచారన్నారు. వాటర్ షెడ్ గ్రామమైన కొండాపురంలో కూడా సబ్సిడీ ధరతో రైతులకు వ్యవసాయ పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు అన్నివిధాలుగా బాసట..

రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా బాసటగా నిలుస్తున్న ముఖ్యమంత్రుల్లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిది ప్రథమ స్థానం అయితే , ఆ తరువాతి స్థానం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు పాలనలో వానలు లేక కరువు తాండవించిందన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకొని , రైతుల్లో వ్యవసాయంపై మరింత మక్కువ పెంచారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్ , వాటర్‌షెడ్ చైర్మన్ ఆంజనేయులు , పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివప్ప, రామన్నయాదవ్, మాజీ సర్పంచ్ రాముడు, వేపరాల రాఘవేంద్ర గౌడ్, ఈఓపీఆర్డీ రఘురామారావు, వాటర్‌షెడ్ జేఈ శ్రీరాములు, టీఓలు ఐఎస్‌సీబీ వీరన్న, విశ్వేశ్వరప్ప, సీఓ ఖాజాహుస్సేన్, సచివాలయ సిబ్బంది, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సబ్సిడీ ధరతో మంజూరైన వ్యవసాయ పరికరాలను రైతులకు అందిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మఘట్ట: 2023–24 విద్యాసంవత్సరం బ్యాక్‌లాగ్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6,8,9 తరగతుల్లో కేటగిరీల వారీగా ప్రవేశపరీక్ష నిర్వహించి, సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 6వ తరగతిలో బీసీ-డీ-1, ఎస్సీ -2, 8వ తరగతలో బీసీ ఏ-1, బీసీ బీ-2, ఎస్సీ1, ఎస్టీ-1, 9వ తరగతిలో బీసీ-ఏలో 1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 5 నుంచి 12వతేదీ వరకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20న ఉదయం 11 గంటలకు పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

మండల ఉపాధ్యక్షుల ఎన్నికకు నేడు నోటిఫికేషన్

రాయదుర్గం రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు రాయదుర్గం మండల పరిషత్ – 1వ ఉపాధ్యక్షుల ఎన్నిక ఈనెల 8న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. గత నవంబర్ నెలలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ నాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఖాళీగా ఉన్న 1వ వైస్ ఎంపీపీ పదవికి స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

క్లుప్తంగా

కర్ణాటక మంత్రికి ఘన సన్మానం



కర్ణాటక మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

విడపనకల్లు: కర్ణాటక మంత్రి నాగేంద్రను వైఎస్సార్‌సీపీ నాయకులు వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీత, సర్పంచు రామాంజినేయులు, ఉప సర్పంచు మోదుపల్లి మురళీమోహన్ తదితరులు శనివారం ఘనంగా సత్కరించారు. అనంతపురం నుంచి బళ్లారికి వెళ్తున్న మంత్రితో పాటు మాజీ మేయర్ మోదుపల్లి రాజేశ్వరిని పెద్ద కొట్టాలపల్లి వద్ద 42వ జాతీయ రహదారిపై గజమాలతో సన్మానించారు. కుడేరు మండలం జల్లిపల్లి టోల్‌గేట్ వద్ద వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా నేత చిగరబంకుల గోపినాథ్ మంత్రిని పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మోదుపల్లి లక్ష్మీనారాయణ, రామసుబ్బయ్య, మోదుపల్లి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్

కూడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని కమ్మూరు సర్పంచ్ రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో ప్రభుత్వం ఖరీఫ్‌కు సబ్సిడీతో అందిస్తున్న విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. 40 శాతం సబ్సిడీతో అందిస్తున్న విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఏఏ నగేష్ పాల్గొన్నారు.

కర్నూలు వెళ్లి పింఛన్ అందజేత



కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మీకాంతం

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామానికి చెందిన కదరంపల్లి వన్నూరుస్వామి (టీడీపీ కార్యకర్త) అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ లక్ష్మీకాంతం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వన్నూరుస్వామికి పింఛన్ సొమ్ము అందించాడు.

నేడు జ్యేష్టాభిషేక మహోత్సవం

ఉరవకొండ రూరల్: బూదగవిలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం జ్యేష్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అర్కరిషి మహాగురు చేతుల మీదుగా జ్యేష్టాభిషేకం, అర్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భవానీ శంకరాలయాన్ని సందర్శించిన మాజీ సీఎస్



భవానీ శంకరాలయంలో మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం దంపతులు

కళ్యాణదుర్గం: మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం దంపతులు పట్టణంలోని భవానీ శంకరాలయానికి వచ్చారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా శనివారం కళ్యాణదుర్గానికి వచ్చిన ఆయనకు తాలూకా బ్రాహ్మణ సేవా సంఘం, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితులు పూర్ణకుంభంతో ఎల్వీ సుబ్రహ్మణ్యం దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం పండితుల ఆశీర్వచనాలు చేసి స్వామివారి శేష వస్త్రాలు అందజేశారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీఓ విజయలలిత

వజ్రకరూరు: సమష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఎంపీడీఓ విజయలలితకు సూచించారు. ఇటీవల కర్నూలు జిల్లా పరిషత్‌లో ఏఓగా పని చేస్తున్న విజయలలిత పదన్నోతిపై వజ్రకరూరు ఎంపీడీఓగా నియమితులయ్యారు. దీంతో శనివారం ఆమె అనంతపురంలో మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజాప్రతినిధులు, అధికారులను కలుపుకొని మండలాభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆమెకు సూచించారు.

ప్రజాద్రోహి చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

• గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: ప్రజాద్రోహి చంద్రబాబును నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని మల్లాపురం, మల్లాపురం తండాలో శనివారం ఆయన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో కొచ్చిన తర్వాత అర్హులకు చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ ఇంటింటికీ బ్రోచర్లు అందించారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రజాసంక్షేమం , అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదిస్తే మరెంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతీ, సీఐ లక్ష్మణ, ఎంపీడీఓ కొండయ్య, పార్టీ నాయకులు రేకులకుంట శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గురునాథ్ రెడ్డి, స్టోర్ డీలర్ శివారెడ్డి, వెంకటరెడ్డి, నాగరాజ రెడ్డి, ద్రోణాచలం రెడ్డి, సత్తిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి హేమంత్ రాజు, గ్రామస్థాయి పార్టీ నాయకులు , సచివాలయ సిబ్బంది , వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బ్రోచర్లను అందిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



విప్ కాపునకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

రాయదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని డీఎస్సీ–98 క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిని ఆయన స్వగృహం వద్ద కలిసి సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 24 ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమ ఆకాంక్షను సీఎం జగన్ నెరవేర్చారని సంతోషం వ్యక్తం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి డీఎస్సీ–98 అభ్యర్థుల ఫైలుపై సంతకం చేసి, ఉద్యోగాల్లో చేరేలా కృషి చేశారన్నారు. అనంతరం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా కృషి చేయాలని విప్ కాపుకు ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో 98 డీఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడాది దాటినా డబ్బు ఇవ్వరా?

గుమ్మఘట్ట: రబీ సీజన్‌లో వేరుశనగ కొనుగోలు చేసి ఏడాది దాటింది.. ఇప్పటికైనా డబ్బులు ఇవ్వరా? అని ఆర్.కొత్తపల్లికి చెందిన పార్వతమ్మ, శ్రీనివాసరెడ్డి ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తున్నారు. వీరు 2022లో రబీ సీజన్‌లో వేరుశనగ పండించారు. పంట దిగుబడిని సిరి స్వచ్ఛంద సంస్థ ఏజెన్సీ వారు ప్రకృతి సేంద్రీయ వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సహాయక సంఘం తరపున కే 6 రకం వేరుశనగ కొనుగోలు చేశారు. క్వింటా రూ.6,550 చొప్పున 148 క్వింటాళ్లను రూ.9.69 లక్షలకు కొనుగోలు చేశారు. ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగితే రూ.4.50 లక్షలు చెల్లించారు. మిగిలిన డబ్బు ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోలేదని బాధితుడు శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం దేవాలయం సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. పాత కొత్తచెరువు గ్రామానికి చెందిన దేవమ్మ (65) నెల పూజోత్సవ కార్యక్రమానికి వచ్చి బస్సుదిగి రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెతో పాటు వచ్చిన మరో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

• మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గం: వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఒకటో సచివాలయం వద్ద కౌన్సిలర్ బీమనపల్లి నాగవేణి ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం చేపట్టారు. ప్రతి వలంటీర్‌కు శాలువ, బ్యాడ్జీ, ప్రశంసాపత్రం అందించి, సత్కరించారు. సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తులసి మొక్కతో పోల్చారని గుర్తుచేశారు. విప్ కాపు రామచంద్రారెడ్డి పేదల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోనూ ఈ నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలీబాషా, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివ, గౌని శ్రీరామిరెడ్డి, దివాకర్, రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది నగేష్, ప్రశాంత్, బేబీ, వలంటీర్లు పాల్గొన్నారు.



ఒకటో సచివాలయం వద్ద వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో శాంతి ర్యాలీ

కళ్యాణదుర్గం: క్రీస్తు సందేశాన్ని వినిపిస్తూ బైబిల్ విరామ కళాశాల విద్యార్థులు భక్తిశ్రద్ధలతో శాంతి ర్యాలీ చేపట్టారు. శనివారం పట్టణంలోని పెనుయేలు ప్రార్థనా మందిరం నుంచి టీ సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సంఘ విశ్వాసులు, విద్యార్థులు క్రీస్తు గీతాలను ఆలపించారు. క్రీస్తు బోధనలతో మారు మనస్సు పొంది ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని సూచించారు. ర్యాలీలో సంఘ కాపరి మోసెస్, జాన్సన్ బాబు, శ్రీధర్, భాస్కర్, మనోజ్, జిల్లా క్రిస్టియన్ నాయకులు జోసెఫ్ కిశోర్, చల్లా కిశోర్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

ఉరవకొండ: మండలంలో తాగునీరు, విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ చందా చంద్రమ్మ అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ సచివాలయాల్లో కొంతమంది ఉద్యోగులు తరచూ గైర్హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలపై ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మండల సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరవుతున్న వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంపీడీఓ చంద్రమౌళి, వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విజయోత్సవ మహాసభ

కళ్యాణదుర్గం: జననేత సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా 4 ఏళ్ల పాలన, నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి కావడంతో ఆదివారం నిర్వహించే విజయోత్సవ మహాసభను జయప్రదం చేయాలని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సభ స్థలాన్ని ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్ రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహాసభకు హాజరయ్యే ప్రముఖుల వివరాలు, ప్రజల సంఖ్య, పార్కింగ్ తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలతో మహాసభను నిర్వహించనున్నట్లు మంత్రి వివరించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, ఎస్పీ కంచి శ్రీనివాసరావు

జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

• నియోజకవర్గ ప్రత్యేక అధికారి వరప్రసాద్

రాయదుర్గం: పేదలందరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని నియోజకవర్గ ప్రత్యేకాధికారి వరప్రసాద్ తెలిపారు. అందుకనుగుణంగా అధికారులందరూ కృషి చేయాలన్నారు. శనివారం పట్టణంలోని 14 జగనన్న లేఔట్లను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఏఈ నాగప్రణవ్, హౌసింగ్ ఏఈ జయచంద్ర తో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఆయా కాలనీల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఇళ్ల నిర్మాణాలు, పురోగతి, వివిధ దశల్లో ఆగిన వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల ఆఖరులోపు 525 ఇళ్ల లక్ష్యం పూర్తి చేయాలన్నారు. కాలనీల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా వార్డుల్లోని కౌన్సిలర్లు, ఇన్‌చార్జులు, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారం కూడా తీసుకొని పూర్తిచేసేలా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరతగతిన ఇళ్లు నిర్మించుకోండి

కళ్యాణదుర్గం: జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులు త్వరతగతిన ఇళ్లను నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని కురాకుల తోట లేఅవుట్‌లో శనివారం హౌసింగ్ ఏఈ రామ్మోహన్, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, వార్డు అనిమీటీస్, సచివాలయ సిబ్బందితో కలిసి హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. బిల్లుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని సిబ్బందికి సూచించారు.



బీటీపీ రోడ్డులోని లేఔట్ లో ఇళ్ల నిర్మాణాలపై చర్చిస్తున్న ప్రత్యేకాధికారి వరప్రసాద్

జూలై 15 వరకూ గ్రామీణ బ్యాంకుల్లో పంట రుణాలు

కూడేరు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జూలై 15 వరకూ ఎకరాకు సుమారు రూ.39 వేల వరకు పంట రుణాలు మంజూరు చేయనున్నట్లు బ్యాంకు రీజనల్ మేనేజర్ టి.మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన కూడేరులోని గ్రామీణ బ్యాంకును తనిఖీ చేశారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. బ్యాంక్‌కు వచ్చే రైతులు, ఖాతాదారులు, ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. గ్రామాల్లోకి వెళ్లి బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 65 బ్రాంచులు ఉన్నాయని ప్రతి బ్రాంచ్‌లో నెలకు రెండు ట్రాక్టర్లు లోన్ ఇస్తామన్నారు. వార్షిక ఆదాయాన్ని బట్టి హౌసింగ్ లోన్లు మంజూరు చేస్తామన్నారు. వ్యవసాయ పనిముట్లు, వాహనాల కొనుగోలుకు రుణాలు ఇస్తామని తెలిపారు. క్రాప్‌లోన్లు తీసుకున్న రైతులు ఏడాదిలోపు రుణాలు చెల్లిస్తే ప్రభుత్వం నుంచి అందే లబ్ధిని పొందడానికి అవకాశముంటుందని ఆయన తెలియజేశారు.



కూడేరు: సిబ్బందితో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

హెల్మెట్‌తో ప్రాణరక్షణ

కూడేరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణ రక్షణ పొందొచ్చని ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కూడేరులో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహ కల్పించారు. ఏఎస్ఐ రామానాయుడు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు

కంబదూరు: జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి కిట్లను సిద్ధం చేస్తున్నారు. శనివారం విద్యా కానుక కిట్లను ఎంఈఓ సాయికృష్ణ పరిశీలించారు.

భూ సర్వే పారదర్శకంగా చేపట్టాలి

కుందుర్పి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద భూ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్లు తిప్పేస్వామి, కుళ్లాయప్ప తదితరులు సూచించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో భూ సర్వేపై సర్వేయర్లు, వీఆర్‌ఓలు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ఇంటి ముందుకు నీళ్లు వచ్చాయని వ్యక్తిపై దాడి

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం ఓబిగానిపల్లి గ్రామానికి చెందిన చాకలి ప్రకాష్‌పై అదే గ్రామానికి చెందిన బొమ్మలింగ, చిట్టెమ్మలు తమ ఇంటి ముందుకు నీళ్లు వచ్చాయంటూ దాడి చేశారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. దాడిలో ప్రకాష్ తలకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ బీమాకు నమోదు చేసుకోండి

బ్రహ్మసముద్రం: మండల ప్రజలు వైఎస్సార్ బీమాకు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకట్ నాయుడు శనివారం తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు సర్వే చేపట్టి అర్హులను గుర్తించాలన్నారు. సంబంధింత యాప్‌లో పేర్లను నమోదు చేయాలన్నారు. ఈనెల 9 లోపు బీమా నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు.

అగ్రికల్చర్ ఫారం ఏడీఏగా నారాయణనాయక్

కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్ ఫారం ఏడీఏగా నారాయణనాయక్‌ను జిల్లా అధికారులు నియమించారు. ఇక్కడ పని చేస్తున్న రవిని అనంతపురం రెగ్యులర్ ఏడీఏగా బదిలీ చేశారు. గుత్తి డివిజన్‌లో పని చేస్తున్న ఏడీఏ నారాయణనాయక్‌ను కణేకల్లు అగ్రికల్చర్ ఫారంకు బదిలీ చేశారు. కొత్త ఏడీఏ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

గుమ్మఘట్ట: డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న నరేశ్‌కుమార్ యల్లనూరుకు బదిలీపై వెళ్లారు. రాయదుర్గంలో డీటీగా పని చేస్తున్న రఘును గుమ్మఘట్టకు ఆశాఖ ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

విడపనకల్లు ఈఓఆర్డీగా సత్యబాబు

విడపనకల్లు: విడపనకల్లు ఈఓఆర్డీగా సత్యబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈఓఆర్డీగా పనిచేస్తున్న చంద్రమౌళి బదిలీపై ఉరవకొండకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఈఓఆర్డీకి పంచాయతీ కార్యదర్శులు మునాఫ్, బాషా, సోమయ్య, రామకృష్ణ, నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు.

పీఎం బీమా యోజన సద్వినియోగంచేసుకోండి

కూడేరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవన్ జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ మేనేజర్ నాగరాజు సూచించారు. శనివారం ఆయా బీమా పథకాలపై స్టేట్ బ్యాంక్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. 18–50 ఏళ్లలోపు వారు జీవన్ జ్యోతి బీమాకి ఏడాదికి రూ.436 చెల్లిస్తే సహజ మరణమైనా రూ. 2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. బ్యాంక్ సిబ్బంది, బీసీ పాయింట్ నిర్వాహకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

లత్తవరంలో 'బేటీ బచావో- బేటీ పడావో'

ఉరవకొండ రూరల్: కొకుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని లత్తవరంలో శనివారం డాక్టర్లు పివి అనికేతస్, లక్ష్మీ చందన ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. మండంలో స్త్రీ పురుషుల నిష్పత్తి అసమానంగా ఉండటంతో జిల్లా అధికారుల ఆదేశాలతో లత్తవరం గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఈసందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ మహిళల వివాహ వయసు, గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం తదితర వాటి గురించి వివరించారు. స్త్రీ, పురుషుల నిష్పత్తిలో తేడా లేకుండా చేయడమే తమ లక్ష్యమన్నారు.

ఉప సర్పంచ్ పదవికి రాజీనామా

విడపనకల్లు: ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన పురుషోత్తంనాయుడు తన ఉప సర్పంచ్ పదవికి శనివారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాజీనామా లేఖను ఎంపీడీఓ శ్రీనివాసులుకు అందజేశారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి

బెళుగుప్ప: పాడి రైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళ్యాణదుర్గం పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసగుప్తా పేర్కొన్నారు. శనివారం బెళుగుప్ప, శీర్పి గ్రామాల్లోని పశు వైద్యశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడ అందుతున్న సేవలపై రైతులతో ఆరా తీశారు. మండల పశు వైద్యాధికారి రమేష్, సిబ్బంది ఆనందమూర్తి, సుదర్శన్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌కు 81 మంది హాజరు

కళ్యాణదుర్గం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన పాలిసెట్–2023 కౌన్సెలింగ్‌కు 81 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్‌కుమార్ తెలిపారు. ఉదయం 74,001 నుంచి 91,000 ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ జరిగిందన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణం పరిశీలన

బెళుగుప్ప: మండల కేంద్రంలో నాడు – నేడు పనుల కింద సుమారు రూ.1.75 కోట్లతో చేపట్టిన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. పనులకు సంబంధించిన ఎస్టిమేషన్ వివరాలను ఆర్‌అండ్‌బీ ఈఈ కాటమయ్య, డీఈ ప్రసాదరెడ్డికి జేఈ కావ్య, స్థానిక వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి, సూపర్‌వైజర్ రమణ వివరించారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలను పాటించడంతోపాటు త్వరిత్వరిత పూర్తి చేసేలా చూడాలని వారు సిబ్బందికి సూచించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

కణేకల్లు: సొల్లాపురంలో ఆదివారం ఉదయం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరగనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు ఆలూరు చిక్కణ్ణ, టీ కేశవరెడ్డి తెలిపారు.